క్లుప్తంగా

ప్రభుత్వ భూమిని ఆక్రమించొద్దు..



ప్రభుత్వ స్థలంలో బోర్డు పాతిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

వైరా: మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించొద్దని తహసీల్దార్ కేవీ శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం వైరాలోని మార్కెట్ రోడ్‌లోని 93 సర్వే నంబర్ భూమిలోని గుట్టను కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకుని తవ్వుతున్న విషయాన్ని తెలుసుకున్న తహసీల్దార్.. సిబ్బందితో వెళ్లి స్థలంలో ప్రభుత్వ స్థలమనే బోర్డు పాతించారు. ఎవరైనా అక్రమిస్తే చట్ట రిత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రావెల్ తరలింపును అడ్డుకోవాలి

ఎర్రుపాలెం: మండలంలోని కండ్రిక గ్రామానికి చెందిన గ్రామకంఠం భూముల్లో ఓ కాంట్రాక్టర్ అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్‌ను రెవెన్యూ అధికారులు అడ్డుకోవాలని ఆ గ్రామానికి చెందిన ఎస్.సీతారామరాజు, బి.కొండ, జామా తదితరులు గురువారం తహసీల్దార్ ఉషాశారదకు ఫిర్యాదు చేశారు.

13న లోక్ అదాలత్

తల్లాడ: ఈ నెల 13న మధిర కోర్టులో నేషనల్ లోక్ అదాలత్ ఉంటుందని తల్లాడ ఎస్సై వెంకటకృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏమైనా కేసులున్నవారు ఈ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవచ్చని తెలిపారు. ఫిర్యాదు దారుడు, నేరస్తుడు ఆధార్ కార్డు తీసుకొని మధిర కోర్టుకు రావాలని ఎస్సై సూచించారు.

సామాజిక అంశాలపై అవగాహన



మాట్లాడుతున్న డి.రంజిత్

పెనుబల్లి: సామాజిక అంశాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. గురువారం టేకులపల్లి మోడల్ స్కూల్‌లో.. ఇన్స్పైర్ అండ్ ఇగ్నైట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గోల్ సెట్టింగ్.. సంస్కారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదర్భంగా డి.రంజిత్, ఎం డి.శ్రీరామ్, డి.సుధాకర్‌లు సమాజంలో గౌరవం, గుర్తింపు రావాలంటే ఏఏ లక్షణాలతో ఎలా మైండ్‌ను ప్రోగ్రామింగ్ చేయాలో చక్కగా వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రూపస్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేద్రంలో సరదాగా..



మాట్లాడుతున్న టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు

సత్తుపల్లిరరల్: సత్తుపల్లి 4వ వార్డులో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లి పిల్లలతో సరదాగా ముచ్చటించి.. పిల్లలకు ఇస్తున్నటువంటి పోషకాహార విషయాలపై.. టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు అంగన్‌వాడీ టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో సరదాగా గడిపారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ వార్డు కౌన్సిలర్ మట్టా ప్రసాద్, వేములవల్లి మధు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి, మువ్వా అభిమానులు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

కొణిజర్ల: ఈ నెల 3న విడుదల చేసిన బీటెక్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్లో విజయ, సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల యాజమాన్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కొణిజర్ల విజయ కళాశాలలో, సత్తుపల్లి మండలంలోని గంగారంలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయా కళాశాల యాజమాన్యాలు అభినందించారు. ఈ కార్యక్రమాలలో కళాశాల చైర్మన్లు బండి పార్థసారధిరెడ్డి, ఉషాకిరణ్‌కుమార్, వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద, ప్రిన్సిపాళ్లు ఊటుకూరి శేషరత్నకుమారి, చిన్నయ్య, కళాశాల కరస్పాండెంట్ ప్రభాకర్‌రెడ్డి, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వానొచ్చెనంటే.. వరదొస్తది

వాగులపై వంతెనలు నిర్మించాలి

- వర్షాకాలంలో తీవ్ర ఇక్కట్లు
- పలుగ్రామాలకు నిలుస్తున్న రాకపోకలు
- స్తంభిస్తున్న జనజీవనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



గత సోమవారం కురిసిన వర్షాలకు పొంగి ప్రవహిస్తున్న జన్నారం - అంజనాపురం వాగు

ఏన్కూరు: వాగులపై వంతెనలు లేక మండల ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాటు.. వాగులు ఉధృతంగా ప్రవహించడంతో పలుగ్రామాలకు రాకపోలు నిలిచిపోతాయి. జనజీవనం స్తంభించిపోతుంది. వాగు పొంగిందంటే చాలు విద్యార్థులు పాఠశాలలకు డుమ్మా కొట్టగా.. రైతులు తమ పంట పొలాలకు వెళ్లలేక ఇంటివద్దనే కూర్చోవాల్సి వస్తుంది.

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

వర్షాలకు వాగులు పొంగినప్పుడల్లా ఇవతల గ్రామ ప్రజలు అటు వెళ్లక.. అవతల ప్రజలు ఇటు రాలేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దీంతో మండల ప్రజలు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ప్రజలు మా బతుకులు ఇంతేనేమో అనుకుంటూ జీవించాల్సిన పరిస్థితి దాపురించింది. కనీసం ఇకనైనా వాగులపై వంతెనలు నిర్మించి ఆదుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వానలకు పొంగే వాగులు..

★ మండల పరిధిలోని జన్నారం - అంజనాపురం వాగు వర్షాకాలంలో పొంగుతుంది.

★ జన్నారం - ఆరికాయలపాడు మధ్యవాగు వర్షాకాలంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి.

☛ ఆరికాయలపాడు రైతులు జన్నారంలోని పొలాలను చూసుకోవాలంటే గద్దల గూడెం మీదుగా అంజనాపురం నుంచి సుమారు 10కి.మీ ప్రయాణించి జన్నారం రావాలి.

★ రంగాపురం - మూలపోచారం మధ్య వాగు పొంగినపుడు ఇరు గ్రామాలకు రాకపోకలు నిలిచి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

★ రేపల్లెవాడ - నాచారం మధ్య ఉన్న వాగుపై వంతెన లేకపోవడంతో.. నిత్యం రాకపోకలు కొనసాగించే రేపల్లెవాడ, నాచారం, గంగుల నాచారం, కాలనీనాచారం, భద్రుతండా, బీమ్లా తండా, రాజులపాలెం, ఒంటిగుడిసె గ్రామప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



రేపల్లెవాడ - నాచారం మధ్య పొంగుతున్న వాగు..

పొలాలకు వెళ్లలేం..



నాకు ఆరికాయలపాడులో పొలాలు ఉన్నాయి. జన్నారం - ఆరికాయలపాడుకు మధ్య ఉన్న వాగుపై వంతెన లేకపోవడంతో వర్షాకాలం వచ్చిందంటే వాగు పొంగుతుంది. దీంతో వాగు తగ్గేవరకు నాతో పాటుగా చాలామంది రైతులు ఆగాల్సిందే. కావున అధికారులు కల్పించుకొని వాగుపై వంతెన నిర్మిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– జాగర్లమూడి సురేష్, రైతు, జన్నారం

వంతెన నిర్మించాలి..



ఆరికాయలపాడు – జన్నారం మధ్య ఉన్న వాగుపై వంతెన నిర్మించాలి. ఈ విషయమై ఎన్నికల సమయంలో ఓట్లు బహిష్కరించగా.. అధికారులు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తెసుకెళ్తామని, మీరందరూ ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. దీంతో మేమంతా ఓట్లు వేశాం. ఇక అంతే అప్పటిన నుంచి ఇప్పటి వరకు ఏ అధికారి మా ఊరు రాలేదు.

– భట్టు హనుమంతు రెడ్డి, ఆరికాయలపాడు

హై లెవల్ వంతెన నిర్మించాలి..



వరద నీటిలో మునిగిన తీగలబంజర సమీపంలోని పగిడేరుపై కాజ్‌వే (ఫైల్)

కొణిజర్ల: మండలంలోని పల్లిపాడు - జన్నారం మీదుగా ఏన్కూరు వరకు ఉన్న రహదారిలో తీగలబంజర, లాలాపురం, గ్రామాల మధ్య ఉన్న పగిడేరుపై గతంలో లో లెవల్ చప్టా నిర్మాణం చేపట్టారు. వర్షాలు వచ్చినప్పుడల్లా సమీపంలోని పలుగ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీనికి తోడు ఖమ్మం జిల్లా నుంచి భద్రాద్రి జిల్లాకు చేరుకోవడానికి ఇదే దగ్గర మార్గం కావడంతో అనేకమంది ఈ మార్గంగుండానే ప్రయాణిస్తుంటారు. వర్షాలు వచ్చినప్పుడల్లా పోలీసులు ట్రాఫిక్ నిలిపివేసి తల్లాడ మీదుగా దాదాపు 10కి.మీ దూరం ప్రయాణించాల్సి వస్తుందని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. పురాతన కాలంలో నిర్మించిన లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరుకోగా, రెయిలింగ్ దెబ్బతిని, రోడ్డుపై గుంతలు పడ్డాయి. దీంతో బ్రిడ్జి ఎప్పుడు కూలుతోందోనని ప్రయాణికులు భయంభయంగా రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఈవిషయాన్ని ఇప్పటివరకు పనిచేసిన నలుగురు ఎమ్మెల్యేలకు తెలిపినా చేస్తాం.. చూస్తాం అంటారే తప్ప పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం ఇకనైనా జిల్లాలోని ముగ్గురు మంత్రులైన పట్టించుకోని బ్రిడ్జి మంజూరుచేసి కష్టాలు తీర్చాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..

పగిడేరుకు వరదలు వచ్చినప్పుడల్లా ఊరు నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదు. అత్యవసరం అయితే సాగర్ కాలవ కట్ట పై ప్రమాదకరంగా ప్రయాణం చేయాల్సి వస్తుంది. వాగు వచ్చినప్పుడల్లా గ్రామస్తులు బయట ఉన్నవారు బయటే ఉంటున్నారు. ఎవరు ఎలా ఉన్నారో తెలియక ఇంటి వద్ద ఉన్నవారు ఆందోళన పడాల్సి వస్తుంది. ఏళ్ల తరబడి మాకు ఇవే సమస్యలు.

– బానోత్ హరిచంద్, లక్ష్మీపురం

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



కారేపల్లి: పాఠశాలలో స్టోర్‌రూంను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

కారేపల్లి: మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించపోతే చర్యలు తప్పవని సింగరేణి ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మండలంలోని రేలకాయలపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలలో స్టోర్ రూంను తనిఖీ చేసి.. స్టోర్‌లో సరుకులు నిల్వలు లేవన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఇన్‌చార్జ్ హెచ్‌ఎంకు సూచించారు. వీరివెంట గ్రామ కార్యదర్శి రమేష్ ఉన్నారు.

బీసీ గురుకులాన్ని తనిఖీ చేసిన ఎంపీడీఓ..

కొణిజర్ల: మండలంలోని అమ్మపాలెం పంచాయతీలో గల మహాత్మా జ్యోతీబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల(వైరా)ను గురువారం ఎంపీడీఓ ఆర్.ఉపేంద్రయ్య తనికీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగమణి, ఏటీపీ రంజిత్, డిప్యూటీ వార్డెన్ నిర్మల, హెచ్‌ఎస్ తులసి సిబ్బంది పాల్గొన్నారు.

కోతుల నుంచి తప్పించుకునే క్రమాన గాయాలు

కారేపల్లి: కోతులు ఎగబడుతుండడంతో తప్పించుకునే క్రమాన ఓ వ్యక్తి మెడకు దండెం తీగ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని సూర్యతండాకు బానోతు రమేష్ గురువారం చేను పనులకు వెళ్లి ఇంటికి వచ్చాడు. డాబాపై ఉన్న బట్టలను తీసుకొచ్చేందుకు వెళ్తుండగా కోతుల గుంపు ఎగబడింది. దీంతో హడావుడిగా కిందకు దిగుతుండగా దండెం తీగ మెడకు తాకి గొంతుకు తీవ్ర గాయమైంది. ఆయనను కుటుంబీకులు కారేపల్లి పీహెచ్‌సీకి తరలించారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలను తరలించొద్దు..

కల్లూరు: సుమారు 100మంది విద్యార్థులు చదువుతున్న కల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాలను సత్తుపల్లికి తరలించొద్దని ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కల్లూరులో ఎమ్మెల్యే మట్టా రాగమయికి వినతిపత్రం అందించారు. నాయకులు ఏఐఎస్ ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నాగుల్ మీరా, ఏఐటీయూసీ ఉపాధక్షుడు రాంబాబు, కల్లూరు మండల కార్యదర్శి దయాకర్, సందేశ్, తనీష్ పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కల్లూరురూరల్: ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిప్రతం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాకర్లపల్లిలో స్థలాలు లేక ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. ఈ విషయాన్ని అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపినా ఫలితం లేదన్నారు. అదేవిధంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాకర్లపల్లిలో 11కేవీ విద్యుత్‌లైన్ సత్తుపల్లి నుంచి కాకర్లపల్లి ఎస్సీ కాలనీ మీదుగా వెళ్లడంతో కాలనీ వాసులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో డివిజన్‌కమిటీ సభ్యులు కృష్ణార్జున్‌రావు, కుమారస్వామి, వెంకటేశ్వరరావు, చిట్టెమ్మ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మధిర ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారి

మధిర: మధిర ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పాగి బాలస్వామి, చెరుకూరి వినోద్ ఎన్నికయ్యారు. అలాగే, గౌరవ అధ్యక్షుడిగా మక్కెన నాగేశ్వర రావు, కోశాధికారిగా పల్లపోతు ప్రసాదరావు, గౌరవ సలహాదారులుగా మిర్యాల శ్రీనివాస రావు, రావిరాల శశికుమార్, ధనిశెట్టి శ్రీనివాస రావు, అట్లూరి సాంబిరెడ్డి, కొంగర మురళి, విజయ్ సాధు, కిలారు కిషోర్, మువ్వా మురళిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మురళి, రావూరి కృష్ణప్రసాద్, కర్లపూడి వాసు, సుంకర సీతారాములు, నర్వనేని అనిల్ ఎన్నికయ్యారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా 'కిలారు'



కిరణ్‌కుమార్

కొణిజర్ల: బీఆర్ఎస్ పార్టీ కొణిజర్ల మండల అధ్యక్షుడిగా మండలంలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన కిలారు కిరణ్‌కుమార్ నియమితులయ్యారు. గురువారం కొణిజర్లలోని బోడపోతుల బాబు ఇంటిలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో.. మండల అధ్యక్షుడిగా కిలారు కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పొట్లపల్లి జీదయ్య, ఉపాధ్యక్షుడిగా మీటు నాయక్, యూత్ అధ్యక్షుడిగా రావు సురేష్, ఏడుగురు కార్యవర్గ సభ్యులు, నలుగురు గౌరవ సలహాదారులుగా ఎన్నుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న హనుమంతరావు

మధిర: మధిర పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీకి సంబంధించి, వీధి దీపాలు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు, నాయకుడు శేఖర్ బాబు పేర్కొన్నారు. ఈ సదర్భంగా గురువారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించగా.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు.

రైతులను ఆదుకోవాలి

చింతకాని: వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని టీడీపీ నాయకుడు వాసిరెడ్డి రామనాథం డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని లచ్చగూడెం, నేరడ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించాక తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. శ్రీనివాసరావు, సత్యనారాయణ, తాజుద్దీన్, గోపాలరావు పాల్గొన్నారు.

ప్రమాద బీమా పెంపుపై హర్షం

సత్తుపల్లి: తెలంగాణ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు భవన నిర్మాణ కార్మికులకు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు ప్రమాద బీమా పెంపుపై ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా కోశాధికారి అమర్లపూడి శరత్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అయితే ప్రైవేట్ సంస్థకు అప్పగించటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.



బోనకల్: వినాయకుడి శోభాయాత్రలో భక్తులు

ఘనంగా గణనాథుడికి వీడ్కోలు

గత తొమ్మిది రోజులుగా పూజలందుకున్న గణనాథుడికి గురువారం భక్తులు వీడ్కోలు పలికారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లపై వినాయకుడిని ఉంచి.. మేళతాళాల నడుమ నృత్యం చేస్తు వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కమిటీ సభ్యులు ప్రజలకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయా గ్రామాల సమీపంలో ఉన్నటువంటి మున్నేరు, చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేయగా.. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లిరూరల్: గంగారంలో బాలరాముడి ఆకారంలోని వినాయకుడిని ఊరేగిస్తున్న దృశ్యం



వైరా: సత్రం బజార్ గణేష్ మండపంలో పూజలు చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్



పెనుబల్లి: పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మట్టా రాగమయి



ఏన్కూరులో..



వేంసూరు: మొద్దుల గూడెంలో..



తల్లాడ: అన్నారుగూడెంలో అన్నదానం చేస్తున్న గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు



చింతకాని: మత్కేపల్లిలో..



కల్లూరురూరల్: వెంకటాపురంలో..

సైకిల్‌పై బుజ్జి గణపయ్య

కొణిజర్ల: మండలంలోని పల్లిపాడు గ్రామంలో కొంత మంది చిన్నారులు తాము మట్టితో తయారు చేసిన చిట్టి గణపతి విగ్రహానికి 9రోజుల పాటు పూజలు చేసి గురువారం తమ సైకిల్‌పై విగ్రహాన్ని పెట్టుకుని గ్రామంలో ఊరేగించారు. అనంతరం సమీపంలోని సాగర్ కాల్వలో గణేషుడిని నిమజ్జనం చేశారు.



పల్లిపాడులో సైకిల్‌పై గణేష్ విగ్రహాన్ని ఊరేగిస్తున్న చిన్నారులు

నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకోవాలి



విజేతల వివరాలు ప్రకటిస్తున్న ఎంఈఓ

సత్తుపల్లి: విద్యార్థులలో వివిధ నైపుణ్యాలను గుర్తించే ఉపాధ్యాయులు మొదట తమలోని నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకోవాలని ఎంఈఓ నక్కా నాగేశ్వరరావు సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం సత్తుపల్లి పాతసెంటర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శైలకుమారి అధ్యక్షతన ఉపాధ్యాయులకు వివిధ అంశాల్లో మండలస్థాయి పోటీలు నిర్వహించారు. మండల స్థాయి విజేతలుగా పాటల పోటీలో దారా ఏసురత్నం(కాకర్లపల్లి ప్రాథమిక పాఠశాల), చిత్రలేఖనంలో దివి శ్రీనివాస్(జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సత్తుపల్లి), డైలాగ్ డెలివరిలో ఎం.లక్ష్మణాచారి(యూపీఎస్, సిద్ధారం) ఎంపిక అయినట్లు ప్రకటించారు. న్యాయ నిర్ణేతలుగా బి.మధుసూదన్ రాజు, పివిఎస్ మల్లికార్జున్‌రావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బి.నర్సింహారావు, బి.సూధాకర్ రెడ్డి, నిరంజన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలస్థాయిలో ఎంపిక అయిన వారు జిల్లా కేంద్రంలో జరిగే పోటీల్లో పాల్గొనాలన్నారు.

ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవం..

మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా విద్యాలయాల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి.. ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. పలు పాఠశాలల్లో స్వయం పాలనా దినోత్సవాన్ని నిర్వహించి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎర్రుపాలెం: ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంఈఓ మురళీమోహన్‌రావు



ఎర్రుపాలెం: ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు



పెనుబల్లిలో..